# అంతర్యం

"పిల్లవా డట్లా దిగులు పడిపోతున్నాడు. పిచ్చివాడిలా తిరుగుతుంటే మీకు చీమకుట్టినట్లు కూడా లేదు. ఉండి కర్మలేక దరిద్రం అన్నట్లు అవకాశం ఉండికూడా మీరిట్లా నిమ్మకు నీరెత్తి నట్లు కూర్చుంటున్నారంటే ఏమనుకోవాలి ?" నిష్ఠురంగా అన్నది రుక్మిణమ్మ.

"అబ్బబ్బా నీకు చెప్పినా అర్థం కాదుగాని, అనవసరంగా నన్ను విసిగించకు" చిరాగ్గా అన్నాడు వాసుదేవరావు.

"ఆ... ఇంకా అర్థం అయ్యేదేమిటి ? నలభై ఏళ్ళనుంచి కాపురంచేస్తున్నాను. ఏపనైనా సవ్యంగా పూర్తిచేశారా? చిన్నదో, చితకదో ఓ కొంప కట్టుకుందాం అని శతవిధాల పోరితే నావల్ల అయిందా ? మీరు రిటైరుకూడా అయ్యారు. ఇంకా అద్దె కొంపల్లో బ్రతుకుతున్నాం ఇక మనవల్ల అయ్యే పనేనా అది ? ప్రతిదానికి పిచ్చిదానిలా నేను ఆరాటపడటమేతప్ప, మీకు ఒక సంగతిపట్టింది కనకనా ?" ఆమె మాటల్లో ఈసడింపు.

"ఆరాటపడగానే సరిపోదు. పిండికొద్దీ రొట్టె అని ఊరికే అన్నారా ? స్తోమత తెలుసుకుని తాపత్రయపడితే తెలివైన పని అవుతుంది, అది లేకుండా ఊహాగానాలు చేస్తూ ఆరాటపడిపోతే ఇదిగో....ఇట్లాగే ఆరాటం ఒక్కటే మిగులుతుంది."

"మీ తెలివితేటలకేం లేండి ? ఈ మాటలతోనేగా అప్ప ట్నుంచి ఇప్పటివరకు నా నోరుమూస్తూ వచ్చారు. అయిందానికీ,

కానిదానికి స్తోమత-స్తోమత అంటూ ముడుచుక్కూర్చున్నారు. అవకాశాలన్నీ పోగొట్టుకొని ఇప్పుడు ప్రాప్తం లేకపోతే ఎవరేం చేస్తారంటూ, వేందాంతం చెప్తూకూర్చుంటారు. సంబడం!" నిర్లక్ష్యంగా అన్నది రుక్మిణమ్మ.

"రుక్కూ, నువ్వు ఎన్నన్నా చెప్పు. నేను ఇప్పటివరకు ఏ పని చేసినా సరిగా ఆలోచించే చేశాననే ఆత్మవిశ్వాసం నాకుంది. ఇక ముందుకూడా అంతే. నువ్వొత్త పిచ్చిమాలోకానివి. ప్రపంచం ఏమిటో, పరిస్థితులు ఏమిటో నీకు తెలియవుగాని, లేచి అన్నం పెట్టే ఏర్పాటు చూడు."

"ఈ పిచ్చిమాట లెందుకులే గానీండి, వాడికి ఆ ఉద్యోగం విషయం చూడండి, మీ ముందుచూపు, జాగ్రత్తలకు మెచ్చుకున్నాను గాని ఇక పిల్లవాడలా ఉండటం నా కిష్టంలేదు. దిగులుతో సగమైపోయాడు పిచ్చి సన్యాసి, వాళ్ళ 'ఇస్తాం' అన్నప్పు డింకా మీ కేమిటంట ఈ అర్థంలేని మీనమేషాలు ?"

"ఏమిటోయ్, వాళ్ళు ఉద్యోగం ఇస్తామన్నారు. బాగానే ఉంది. ఇక అదొకటుంది కదా అని ఇక వేరేప్రయత్నాలు, పరీక్షలు లేకుండా కూర్చోవాలా ? ఎటూ దారిలేకపోతే అనుకోవచ్చు. వాడికింకా వయసు మీరిపోలేదు గవర్నమెంటు ఉద్యోగంలో చేరడానికి. నువ్వు ఊరికే గారాబం చేసేస్తూ వాణ్ణి వెనకేసుకొస్తావ్" మందలింపుగా అన్నాడు వాసుదేవరావు.

పొంగుకొస్తున్న కోపాన్నంత తాత్కాలికంగా దిగమింగుకుంది రుక్మిణమ్మ. లేకపోతే భర్తకి కోపం శ్రుతిమించుతుందని

ఆమెకు తెలుసు. అప్పుడు జరిగే అవాంఛనీయ సంఘటనలూ ఆమెకు అనుభవమే. అందుకే భోజనాలయ్యేంత వరకూ మౌనమే మంచిదనుకున్నది రుక్మిణమ్మ.

ఏవేవో ఆలోచనలు మనసులో సుడులు తిరుగుతున్నై వాసుదేవరావుకు. అయినా ఏమీ మాట్లాడకుండా భోజన కార్యక్రమంలో నిమగ్నుడయ్యాడు ఆయన.

వాసుదేవరావు ఓ పెద్ద ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేసి రిటైరయ్యాడు. ఆ సందర్భంగా కంపెనీవారు కొంత డబ్బు ఇచ్చారు. ఉద్యోగం చేస్తూ తాను మిగుల్చుకున్న సొమ్మునుకూడా కలిపి బ్యాంకులో వేసుకుని దానిపైన వచ్చే వడ్డీడబ్బుతో సంసారం సాగిస్తున్నా డాయన.

వాసుదేవరావుకు ఓ కొడుకు, ఓ కూతురు, కొడుకు డిగ్రీ పాసయ్యాడు. కూతురు పదో తరగతి వరకు చదివి స్వస్తిపలికింది.

చాలాకాలం కంపెనీలో పనిచేసిన వాసుదేవరావు యాజమాన్యం దగ్గర మంచి పేరు సంపాదించుకున్నాడు. వారికి ఆయనంటే గౌరవం, అభిమానం ఉన్నాయి. అందువల్లనే తను రిటైరైన సందర్భంలో కంపెనీ యజమాని ఆయన కోమాట ఇచ్చారు.

ఎప్పుడైనా ఆయన చెప్పిన వ్యక్తికి ఒకరికి తమ కంపెనీలో ఉద్యోగం ఇస్తామని యజమాని చెప్పిన మాట వాసుదేవరావుకు కొండంత బలాన్ని చేకూర్చింది. తను రిటైరై పోయానన్న బాధను మరిపింప చేసిందా మాట. ఆ సంతోషం పట్టలేక ఆ క్షణమే భార్య చెవిన వేశాడాయన. ఆమెకు చాలా సంతోషం కలిగింది.

కాని అప్పటి ఆవిడ సంతోషం తననిలా రోజూ నిష్ఠూరాల తోనూ, ఈసడింపులతోనూ కలవర పెడుతుందని ఊహించలేక పోయాడు వాసుదేవరావు.

ఆ ఉద్యోగం గురించి కొడుకు తనను ఒకే ఒక్కసారిగా అడిగాడు. మౌనంగా తలాడించి ఊరుకుండి పోయాడు వాసుదేవ రావు. తండ్రి ఆంతర్యం అర్థంకాకపోయినా ఎందుకో మళ్ళీ తన దగ్గర ఆ ప్రస్తావన తీసుకురాలేదు కొడుకు.

దాదాపు రోజుకు ఒక్కసారైనా రుక్మిణమ్మ భర్త దగ్గర కొడుకు ఉద్యోగం గురించి అడగటం, ఆయన ఇదే ధోరణిలో సమాధానం చెప్పటం మామూలై పోయింది.

భర్త నిర్లిప్తతతో నిసుగెత్తిన రుక్మిణమ్మకు ఈ రోజు ఏదో ఒకటి తేల్చుకోవాలనీ, తెలుసుకోవాలనీ పట్టుదల పెరిగింది. అందుకే భోజనానంతరం మళ్ళీ ఆయన పక్కన చేరింది పంచాంగం చేతపట్టుకుని.

"ఏమండీ, రేపు వెళ్ళిరండి. మంచిరోజు. నక్షత్రం కూడా బాగుంది. మీరు చెప్పినట్లు గవర్నమెంటు ఆఫీసులో ఏవైనా ఉద్యోగం వస్తే ఇక్కడ మానుకుని వెళ్తాడు. అంతకంటే ఏం నష్టంలేదుకదా ?" అనునయంగా అన్నది రుక్మిణమ్మ.

"రుక్కూ నన్ను కాసేపు ప్రశాంతంగా ఉండనిస్తావా? ఎంత సేపూ నీ ఆలోచనే నెగ్గాలి ఇవతల మనిషిని కొంచంకూడా అర్థం చేసుకోవేం" అసహనంగా అన్నాడాయన.

"బుద్ధి ఉన్నవాళ్ళ నెవళ్ళనైనా అడగండి మీ ఆలోచన రైటో. నా ఆలోచన రైటో ఊరికే అంటే పడే మనిషి ఉందికదా అని నా నోరు మూయించటానికి చూడకండి" విసురుగా అన్నది.

"సరే, ఇంతకాలం నా మనసులో మాట నీకు చెప్పలేదు. ఇక చెప్పక తప్పేటట్లు లేదు చెప్పగానే ఊరికెనే గుండెలు బాదేసు కోకుండా సావధానంగా ఆలోచించు. మంచిదో కాదో అప్పుడు చెప్పు."

భర్తకు కొంచెం దగ్గరగా జరిగి బుగ్గన చెయ్యేసుకుని కూర్చుంది రుక్మిణమ్మ.

"మనకు ఆస్తంటూ ఏమీ లేదు. జాగ్రత్త పడ్డానో, అజాగ్రత్తగా వ్యవహరించానో ఒక్క సెంటు భూమికాని, ఓ పూరి గుడిసె కాని ఏర్పరచుకోలేక పోయాం. "మనకున్న ఆస్తల్లా అదిగో, ఆ మహానుభావుడు ఇస్తానన్న ఉద్యోగం ఒక్కటే. ఆ ధైర్యంతోనే నేనిలా ఉండగలుగుతున్నాను. అబ్బాయికి డిగ్రీవరకు చదువు చెప్పించాను. రేపో మాపో వాడికి ఉద్యోగం రాకపోదు. ఉద్యోగం వాడికోసమే కాదు. మననుపోషించటానికున్నూడా.

"అమ్మాయికి పెళ్ళి చేయవలసిన బాధ్యత ఉంది. కట్నాలు ఇచ్చే స్థితిలో మనం లేము. కట్నం లేకుండా వచ్చే వరులూ లేరు. ఉన్నా మనకు తటస్థ పడతారన్న నమ్మకం ఏముంది ? అబ్బాయిలకు ఉద్యోగాల సమస్య. అమ్మాయిలకు పెళ్ళిళ్ళ సమస్య. నా లాంటి ఆడపిల్ల తండ్రులకు కట్న సమస్య.

"మన అమ్మాయికి నచ్చినవాడు, అమ్మాయిని మెచ్చిన నిరుద్యోగి తటస్థపడితే ఈ ఉద్యోగాన్ని కట్నంగా ఇచ్చి అమ్మాయి పెళ్ళి చేయాలన్నది నా ఆలోచన. దీనికి అర్థం ఉందో, లేదో నీవే నిర్ణయించుకో" వివరంగా చెప్పాడు వాసుదేవరావు.

భర్తవంక ఆరాధనా పూర్వకంగా చూస్తూ తన తొందర పాటుకు నొచ్చుకున్నది రుక్మిణమ్మ.

అప్పటి వరకూ తండ్రిపట్ల ఉదాసీనత పెంచుకున్న కొడుకు, ఆయన ఆంతర్యం తెలుసుకుని తండ్రిపట్ల గౌరవభావం పెంచుకున్నాడు.

వాసుదేవరావు ముచ్చట పడ్డట్లే కొద్దికాలానికి కూతురు పెళ్ళి చేయగలిగాడు.

(ఆంధ్రప్రభ సచిత్రవారపత్రిక 26-10-88)